




దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 309 మంగళవారం 5-11-2024 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..


## తెలంగాణలో బిసి కమిషన్ ఏర్పాటు

### మాజీ ఐఎఎస్ ఛైర్మన్‌గా ఉత్తర్వులు

### నెలరోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం

**తొలి సమయం హైదరాబాద్,నవంబర్4:** స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసింది. రిటైర్డ్ ఐఏఎస్ బూసాని వెంకటేశ్వర రావును ప్రభుత్వం ప్రత్యేక కమిషన్‌కు చైర్మన్‌గా నియమించింది. సెక్రటరీగా ఐఎఫ్ఎస్ అధికారి బి. సైదులును నియమించింది. హైకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం ఈ కమిషన్ ను ఏర్పాటు చేసింది. రిజర్వేషన్లపై అధ్యయనం చేసి నెల రోజుల లోపు నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. హైకోర్టు ఇచ్చిన తీర్పును పరిగణనలోకి తీసుకొని ముందుకు వెళ్లాలని ఇప్పటికే సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఇదే అంశంపై ఆదివారం మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, ఉన్నతాధికారులతో జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి సమాలోచనలు జరిపారు. కులగణన, స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో ఇటీవల హైకోర్టు లేవనెత్తిన అంశాలను సమీక్షించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 340, సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం రాజకీయాల్లో బీసీ రిజర్వేషన్ల కల్పన కోసం బీసీల జనాభా లెక్కలు తీసేందుకు ప్రత్యేక కమిషన్ ఉండాలని హైకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఈ నెల 6 నుంచి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల సర్వే ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు, న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు కోర్టు తీర్పులను తప్పకుండా అనుసరించాలని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది.

## ఆదివాసీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

### లాక్కున్న భూములను తిరిగి ఇచ్చే బాధ్యత మాదే

### పదేళ్లలో 25కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం

### జార్ఖండ్‌ను వ్యతిరేకించిన ఆర్జెడితో జెంఎంఎం పొత్తు

### ఇక రాష్ట్రంలో అధికారం తమదే అన్న మోడీ

### ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని



**రాంచీ,నవంబర్4:** ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రచారం హోరెత్తుతోంది. అధికార, విపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తాజాగా ప్రధాని నరేంద్ర మోదీ చాయిబసలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొని విపక్షాలపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. ఝార్ఖండ్‌లో కాంగ్రెస్, ఆర్జేడీ ఆదివాసీలపై అనాగరిక నేరాలకు పాల్పడ్డాయని ధ్వజమెత్తారు. ఆనాడు ఝార్ఖండ్ ఏర్పాటును ఆర్జేడీ వ్యతిరేకించిందన్న ప్రధాని.. ఇప్పుడు జేఎంఎం దాని ఒళ్లో కూర్చొందంటూ చురకలంటించారు. ఈ సారి రాష్ట్రంలో అత్యధిక సీట్లు గెలుచుకొని చరిత్ర లిఖిస్తామని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. ఝార్ఖండ్‌లో భాజపా ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే చొరబాటుదారులను అడ్డుకొనేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. అక్రమంగా లాక్కున్న భూమిని తిరిగి ఆదివాసీ మహిళల పేర్లపై బదలాయించేలా చట్టాన్ని తీసుకొస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి ఓటు బ్యాంకుకు అప్పగించేందుకు చూస్తోందని, ఓటు బ్యాంకు కోసం ఝార్ఖండ్ జనాభా మార్చే విషయంలో జేఎంఎం-కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నాయని ప్రధాని ఆరోపించారు. పేదల కష్టాలను దగ్గర నుంచి చూశానన్న మోదీ.. అందుకే పదేళ్లలో పేదల కోసం పథకాలు అమలు చేస్తున్నామ న్నారు. ఈ పథకాల ఫలితంగానే పదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మాత్రం చాలా కాలంగా ఆదివాసీ సమాజాన్ని పేదరికంలోనే ఉంచాయని ఆక్షేపించారు. ఝార్ఖండ్‌లో పేదరిక నిర్మూలనకు భాజపా కట్టుబడి ఉందన్నారు. ఎన్డీయే కూటమి ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం రాష్ట్రంలోని ఛాయ్‌బస పట్టణంలో ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ సారధ్యంలోని ఎన్డీయే కూటమి జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తనకు ఇది రెండవ ర్యాలీయే అయినప్పటికీ గెలుపుపై ఇప్పటికే నమ్మకం కుదిరిందని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారం కోసం తొలిసారి ఇక్కడి వచ్చాను. ఇది నాకు రెండవ ఎన్నికల ర్యాలీ. ఈ రెండు ర్యాలీలు చూసిన తర్వాత.. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా సగాని కంటే ఎక్కువ సీట్లను బీజేపీ సారధ్యంలోని ఎన్డీయే కూటమి గెలుచు కుంటుందని నేను నమ్మకంతో చెప్పగలను అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. గిరిజన సోదర, సోదరీమణుల ఆకాంక్షలకు అనుగుణంగా బీజేపీ ఏవిధంగా పనిచేస్తోందో మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇక కేంద్రంలో బీజేపీ తొలిసారి ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడు గిరిజన సమాజం కోసం ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని ప్రస్తావించారు. గిరిజన అక్కచెల్లెళ్లు, అన్నదమ్ముళ్ల ఆత్మ గౌరవమే బీజేపీకి అత్యంత ముఖ్యమైనదని మోదీ అన్నారు. అందుకే తొలిసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు గిరిజనుల కోసం రాష్ట్రాన్ని ఇచ్చామని అన్నారు. ఢిల్లీ నుంచి పని చేసే అవకాశం అటల్ బిహారీ వాజ్‌పేయికి దక్కిందని, ఆయన హయాంలోనే గిరిజన రాష్ట్రాలు ఏర్పడ్డాయని మోదీ గుర్తుచేశారు. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ వాజ్‌పేయి హయాంలోనే ఏర్పాటు అయ్యాయని మోదీ చెప్పారు. ఇక రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సమస్యల పరిష్కారంపై దృష్టిసారిస్తామని మోదీ హామీ ఇచ్చారు. ధరలు తగ్గించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇక చట్టవిరుద్ధంగా గిరిజన కూతుళ్ల నుంచి గుంజుకున్న భూములను వెనక్కి ఇప్పిస్తామని మోదీ హామీ ఇచ్చారు. జార్ఖండ్ రాష్ట్ర గుర్తింపును మసక బార్చుతున్నారని జేఎంఎం-కాంగ్రెస్-ఆర్జేడీ కూటమిపై మోదీ తీవ్ర విమర్శలు గుప్పించారు. జార్ఖండ్ గుర్తింపు మార్చివేసే కుట్ర జరుగుతోందని మోదీ అన్నారు.

## సాఫీగా ధాన్యం కొనుగోళ్లు

### అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్



**తొలి సమయం, ప్రధాన ప్రతినిధి మహబూబాబాద్**
రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసేందుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఉమ్మడి జిల్లాకో ఐఏఎస్ను ప్రత్యేక అధికారిగా నియమించింది. రైతులకు ఇబ్బంది తలెత్తకుండా అన్ని జిల్లాల్లో కొనుగోళ్లు చేపట్టాలని, ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కొనుగోళ్లు జరుగుతున్న తీరును పరిశీలించి, ఏమైనా సమస్యలుంటే అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం అసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు కృష్ణ ఆదిత్యకు బాధ్యతలు అప్పగించారు. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా జిల్లాలకు ఆర్వీ కర్ణన్, నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేటకు అనితా రామచంద్రన్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు డా. ఏ.శరత్, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలకు డి.దివ్య, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల్ మరియు నాగర్‌కర్నూల్ జిల్లాలకు రవి, వరంగల్, హనుమకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు టి.వినయ కృష్ణ రెడ్డి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు హరిచందన దాసరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు కె.సురేంద్ర మోహన్ నియమితులయ్యారు.

## ఆదాయా మార్గాలపై ప్రభుత్వం దృష్టి

### భట్టి నేతృత్వంలో ఉపసంఘం భేటీ

**తొలి సమయం హైదరాబాద్,నవంబర్4:** నిధుల సమీకరణపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన దీన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఖజానాకు అదనపు నిధుల సమీకరణపై సమావేశంలో చర్చించారు. సంబంధిత శాఖల అధికారులతో ఉపసంఘం చర్చలు సాగాయి. రాష్ట్రంలో ఆదాయం తగ్గడంతో పాటు అప్పులు పెరుగుతు న్నాయి. అలాగే పథకాల అమలుకు కూడా నిధులు వెచ్చించాల్సి వస్తోంది. దీంతో రాబడి పెంచుకునే మార్గాలపై అన్వేషిస్తున్నారు. ఇప్పటికే రియల్ ఎస్టేట్ ఆదాయం భారీగా పడిపోయింది. కొనుగోళ్లు, అమ్మకాలు తగ్గాయి. ఈ క్రమంలో ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్నారు.



## నేడు నగరానికి వస్తున్న రాహుల్

### 400 మంది ప్రతినిధులతో ఇంటరాక్షన్

### కులగణనపై చర్చించే ఛాన్స్

**తొలి సమయం హైదరాబాద్,నవంబర్4:** ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం హైదరాబాద్ రానున్నారు. బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్ లో మేధావులతో జరిగే సమావేశం లో పాల్గొంటారు. దాదాపు 400 మంది వివిధ వర్గాల వారితో ఇంటరాక్ట్ అవుతారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా తెలంగాణలో కులగణ న ఈ నెల 6 నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో వివిధ వర్గాలతో ఇంటరాక్ట్ అయ్యేందుకు రాహుల్ వస్తున్నారు. కులగణన వాస్తవ పరిస్థితులపై మేధావులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నేతలతో భేటీ అవుతారు. ట్రాన్స్ జెండర్లు, మహిళలతోనూ ముచ్చటిస్తారు. కులగణన ఎలా చేయాలనే అంశాలపై వారితో చర్చిస్తారు. సాయంత్రం 4.45 గంటలకు ఆయన ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్ పోర్టుకు చేరుకుటూరు. అక్కడి నుంచి సాయంత్రం 5 గంటలకు బోయిన్ పల్లి బయల్దేరుతారు. 5.20 గంటలకు అక్కడికి చేరుకొని 5.30 గంటల నుంచి 6.30 వరకు ష్ట్రంలో అమలు చేయనున్న కుల గణనపై వివిధ వర్గాల, వివిధ రంగాల వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. 7.10 లకు బేగంపేటకు చేరుకొని ఢిల్లీ బయల్దేరి వెళ్తారు.



## ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పండి

### హింసించే పులకేశిలా రేవంత్ ప్రభుత్వం

### రాహుల్ రాకతో కెటిఆర్ బహిరంగ లేఖ

**తొలి సమయం, హైదరాబాద్,నవంబర్4:** సీఎంరేవంత్ హింసించే రాజు పులకేశిలా తయారైందని బీఆర్ఎస్‌వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వ కుంట్ల తారకరామారావు విమర్శించారు. ఇచ్చిన ఒక్క హామీని సైతం నిలబెట్టకోకుండా ప్రజలను మోసం చేశారని.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను హింసించే పులకేసి మాదిరిగా హింసిస్తుంటే.. ఏం తెలియనట్లుగా నటిస్తూ ఢిల్లీలో గప్‌చుప్ అయిపో యారని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో ఆయనకు కేటీఆర్ సోమవారం బహిరంగ లేఖ రాశారు. అధికారం కోసం అడ్డగోలు హామీ లిచ్చి, సబ్బండ వర్గాలకు చేసిన మోసం, అభివృద్ధి తెలంగాణను అవినీతి తెలంగాణగా మార్చినందుకు కాంగ్రెస్ పార్టీ తరపున యావత్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని రాహుల్ గాంధీని కేటీఆర్ డిమాండ్ చేశారు.

పదేళ్లలో ఘనంగా అభివృద్ధి చెందిన తెలంగాణకు విచ్చేస్తున్న రాహుల్ గాంధీకి.. పచ్చగా ఉన్న తెలంగాణ మీ ఏడాది పాలనలోనే ఏ విధంగా వందేళ్ల విధ్వంసానికి గురైందో మీ రాక సందర్భంగా ఒక్కసారి మీకు గుర్తు చేయదలచుకున్నా నన్నారు. ఎన్నికలకు ముందు తెలంగాణలో ఏ పిల్లాడికి కూడా కష్టమొచ్చిన సరే ఇలా పిలుస్తే అలా వస్తానని చెప్పి.. తీరా గద్దెనెక్కిన తర్వాత మా ప్రజల గొంతును తడిగుడ్డతో కోశారని ధ్వజమెత్తారు. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆటోడ్రైవర్లు, చేనేత కార్మికులు, మూసీ, హైడ్రా బాధితులు ఇలా ఒక్కరంటే సమాజంలో అన్ని వర్గాలను నయవంచనకు గురి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో వచ్చిన మరుసటి రోజు నుంచే మీ నయవంచన స్వరూపం ఎలా ఉంటుందో ప్రజలకు రుచి చూపించారని కేటీఆర్ ధ్వజమెత్తారు.

వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అంటూ ఊదరగొట్టి మూడు వందల రోజులు దాటినా సరే వాటిని అమలు చేయటం చేతకాక చేతులెత్తేశారని ఆరోపించారు. కాంగ్రెస్ కబంధ హస్తల్లో చిక్కుకొని తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు విలవిలలాడుతోం దని.. అభయహస్తమని నమ్మబలికి భస్మాసుర హస్తంతో తెలంగాణ ప్రజలను నిండా ముంచారని.. అన్నారు. ఆరు గ్యారంటీలు, అభయ హస్తం అంటూ ఇక్కడి ప్రజలను మోసం చేసేందుకు ముందుగా ఢిల్లీ నుంచి వచ్చి నాంది పలకింది రాహుల్ గాంధీయేనని.. యథా రాజా తథా ప్రజా.. అన్న తరహాలోనే మీ బాటలోనే తెలంగాణ నాయకులు నడుస్తు న్నారని విమర్శించారు.



# రౌడీ షీటర్లకు మెండుగా రాజకీయ అండదండలు

- జర్నలిస్టుపై హత్యాయత్నానికి కారణం ఎస్సీ ఎస్టీ కేసేనా ?
- మాస్టర్ ప్లాన్ ఎమ్మెల్యే అనుచరుడిదేనా ?
- కేసు నుండి కొందరిని తప్పించేందుకు డీఎస్పీ యత్నిస్తున్నాడని ఆరోపిస్తున్న బాధితుడు సుదర్శన్
- నిందితుల్లో ఒకరు డీఎస్పీ సమీప బంధువు
- ప్రత్యక్ష సాక్షులను బెదిరిస్తున్న వైనం



**తొలి సమయం హైదరాబాద్ డెస్క్ నవంబర్ 4:** భద్రాద్రి జిల్లా ఇల్లెందులో అక్టోబర్ 17 న దళిత జర్నలిస్టు సుదర్శన్ పై పాశవికంగా దాడి చేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది . జర్నలిస్టు యూనియన్ల సంఘాలకు అతీతంగా ఈ దాడిని ఖండిస్తూ నిరసనలకు దిగారు . జర్నలిస్టు పై దాడి అంశాన్ని ప్రభుత్వం సీరియస్ గా తీసుకున్నా...దాడి సూత్రాదారులు స్థానిక ఎమ్మెల్యే అనుచరులు , రౌడీ షీటర్లు కావడం, నిందితుల్లో ఒకరు డీఎస్పీ సమీప బంధువు అవడంతో కేసును నీరుగార్చేందుకు శత విధాలా ముమ్మర ప్రయ త్నాలు జరుగుతున్నాయి అనే ప్రచారం జరుగుతోంది. దీనికి తగినట్లుగానే విచారణ సరళి కొనసాగుతోంది.

**దాడి సూత్రాదారుడు ఎస్సీ, ఎస్టీ కేసు నిందితుడు ...**

దళిత జర్నలిస్టు పై దాడి కేసులో అసలు కోణం వెలుగులోకి వచ్చింది. గతంలో జర్నలిస్టు సుదర్శన్ పెట్టిన ఎస్సీ, ఎస్టీ కేసులో నిందితులే ప్రస్తుత హత్యాయత్నానికి కారకులుగా తెలుస్తోంది . సదరు నిందితులు స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య అనుచరులు కావడంతో పోలీసు అధికారులు ఈ కేసుకు, ఆ కేసుకు సంభంధం లేదంటూ నీరుగార్చేందుకు యత్నిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

గతంలో జర్నలిస్టు సుదర్శన్, ఎమ్మెల్యే కోరం కనకయ్య అనుచరుడు ఆముదాల ప్రసాద్ కు సంబంధించిన అవినీతి ని వెలికి తీసాడు . బీసీ అయిన ఆముదాల ప్రసాద్ కు ఎస్సీ లోన్ ఎలా మంజూరు చేసారంటూ తన కలం తో ప్రశ్నించాడు. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు







పరారీలో ఉన్న ముగ్గురు వ్యక్తులు




కుచ్చుటోపీ వేస్తున్న వైనాన్ని వెలుగులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేసాడు జర్నలిస్టు నిట్ట సుదర్శన్. దీంతో అన్ని రకాలు గా ఇంటా బయటా అడ్డంకిగా మారిన సుదర్శన్ ను తప్పించేందుకు ఆముదాల ప్రసాద్ సిద్ధమవుతున్నాడనే ప్రచారం పోలిటికల్ సర్కిల్ లో చర్చ గతంలోనూ ఉంది . ఇంత జరిగినా అధికార కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న ఆముదాల ప్రసాద్ ను పోలీసులు అబ్స్కాండ్ చూపెట్టడం మరింత వింతగా ఉంది.

## కేసును నీరుగార్చేందుకు కంకణం కట్టుకున్న డీఎస్పీ ...

డీఎస్పీ తొలుత నుండి కేసు ను నీరుగార్చేందుకు, నిందితులను కేసు నుండి తప్పించేందుకు చూస్తున్నారని జర్నలిస్టు నిట్ట సుదర్శన్ ఆరోపిస్తున్నారు. కేసు లో ఎమ్మెల్యే అనుచరుడు ఆముదాల ప్రసాద్, తన సమీప బంధువు నాగేశ్వరరావు ఏ-8గా ఉండడమే దీనికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. జర్నలిస్టు సుదర్శన్ పై దాడి ఘటన పై స్పష్టమైన ఆధారాలు, వీడియో ఉన్న నేపథ్యంలో కొందరిని కేసులో పేర్కొనకూడదని డీఎస్పీ ఒత్తిడి తీసుకు వస్తున్నారని సుదర్శన్ ఆరోపిస్తున్నారు. సుదర్శన్ పై గతంలోనూ పలు మార్లు దాడి, హత్యా యత్నానికి పాల్పడ్డారు . సుదర్శన్ పై దాడికి యత్నించిన క్రమంలో గత ఐదేళ్లలో ఇప్పటి వరకు 4 కేసులు నమోదు కాగా...అన్నింటిలో ఎమ్మెల్యే అనుచరుడు నిందితుడిగా ఉన్నాడు. సమాజంలో జరిగే తప్పులను ఎత్తిచూపే జర్నలిస్టులపై ఏకంగా దాడులు హత్య యత్నాలు జరుగుతున్నా ... పాశవికంగా చేసిన దాడి వీడియోలు కళ్ల ముందు కనబడుతున్నా..అధికార ఎమ్మెల్యే అండదండలు, పోలీసు ఉన్నతాధికారుల ఆశిస్సులు ఉండడంతో అక్రమార్కులకు అడ్డూ అదుపూ లేకుండా పోతుంది. కేసులో పేర్కొన్న నిందుతుల ఫోన్ డేటా పరిశీలిస్తే... నిందితులకు అండగా ఉన్న రాజకీయ నాయకులు, పోలీసు ఉన్నతాధికారుల బండారం బయట పడుతుందని ఆ దిశగా విచారణ చేపట్టాలని బాధితుడు జర్నలిస్టు సుదర్శన్ డిమాండ్ చేస్తున్నారు. ఎస్సీ ఎస్టీ కేసు పెట్టడం కారణంగానే నాపై హత్యాయత్నం జరిగి ఉంటుందని జర్నలిస్టు సుదర్శన్ అనుమానం వ్యక్తం చేస్తున్న క్రమంలో... ఎస్సీ ఎస్టీ కేసులో నిందితుల బెయిల్ ను తక్షణమే రద్దు చేయాలని కోరుతున్నాడు. ఇప్పటికి 3 సార్లు తనపై దాడి జరిగినా , రెండు సార్లు తనపై హత్యా యత్నానికి పాల్పడినా..దాడి చేసిన వారే మరల దాడికి పాల్పడిన అధికార బలం చట్టం చేతులు కట్టేస్తుందని ఆ కారణం గానే గతంలో తనపై దాడి చేసిన క్రమంలో నిందితుడు ఆముదాల ప్రసాద్ కోర్టులో సైతం తప్పు ఒప్పుకుని ఫైన్ కట్టాడని... ఆపై హత్యాయత్నానికి పథకం పన్నాడంటూ బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని వర్గాలతో సన్నిహితంగా ఉండే జర్నలిస్టు పై పాశవికంగా దాడి చేసి, వీడియో ఆధారాలు ఉన్నా చర్యలకు వెనకాడుతూ... విచారణ పేరిట కాలయాపన చేసే పోలీసు ఉన్నతాధికారులున్న నేపథ్యంలో తనకు న్యాయం జరగడంపై పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా కాలయాపన చేయకుండా పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని జర్నలిస్టు సుదర్శన్ కోరుతున్నాడు.

## పారామెడికల్ కోర్సుల దరఖాస్తుల ఆహ్వానం

**డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ**

**ప్రిన్సిపాల్ సిద్ధార్థ మెడికల్ కాలేజీ జనగామ**



**తొలి సమయం డెస్క్ హైదరాబాద్ నవంబర్ 4:** జనగామ జిల్లాలో గల తెలంగాణ గవర్నమెంట్ మరియు తెలంగాణ పారామెడికల్ బోర్డు చే గుర్తింపు పొందిన పది సంవత్సరాల అనుభవం ఉన్న సిద్దార్థ పారామెడికల్ కాలేజీలో 2024 25 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లు తీసుకొనుటకు పారామెడికల్ బోర్డు నోటిఫికేషన్ రిలీజ్ చేసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్ ప్రెస్ నోట్ ద్వారా తెలియజేశారు. ఈ సందర్భం గా ఆయన తెలియజేసిన వివరాల ప్రకారం....కళాశాలలో మొత్తం ఆరు కోర్సులు అందుబాటులో ఉన్నాయి అవి వరుసగా

**డిఎంఎల్‌టి 15,**
**డిఎం ఎస్‌టి15,**
**డిఎఎన్ఎస్ 15,**
**డిఎంఐటి 15,**
**డిఓఏ 15,**
**డిఎంపిహెచ్ ఏ (పు) 20**

ఈ కోర్సులలో సీట్లు అందుబాటులో ఉన్నాయి ఈ కోర్సులకు అర్హత ఇంటర్మీడియట్ బైపిసి పాసైన వారిని మొదట ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది, అలాగే ఏదైనా ఇంటర్మీడియట్ పాస్ అయిన వారు కూడా అర్హులుగా అడ్మిషన్ తీసుకోవడానికి పారామెడికల్ బోర్డు అవకాశం కల్పించడం గమనార్హం, అదేవిధంగా ఈ కోర్సులలో అడ్మిషన్లు తీసుకోవడానికి ఈనెల 11వ తారీఖున చివరి తేదీగా పారామెడికల్ బోర్డు ప్రకటించింది కావున జనగామ జిల్లా మరియు పరిసర ప్రాంతాలలోని పారామెడికల్ విద్యనభ్యసించుటకు కోరుకొను ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులు తమ తమ అప్లికేషన్ను సిద్ధార్థ పారామెడికల్ కాలేజ్ లో అప్లికేషన్లు అందజేయాలని కోరడమైనది.

## నూతన ఉపాధ్యాయులకు ట్రెజరీ ఐడి ప్రాన్ నెంబర్లను కేటాయించాలి

**పిఆర్‌టియుటిఎస్ జిల్లా అధ్యక్షులు సంకా బద్రి నారాయణ**



**తొలి సమయం మహబూబాబాద్ నవంబర్ 4:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డిఎస్సి తో పాటుగా వెంటనే నియామక ప్రక్రియను వేగావంతంగా నిర్వహించింది, కనుక 2024 ఉపాధ్యాయులకు వెంటనే ప్రాన్ నెంబర్ ఎంప్లాయ్ ఐడి లను కేటాయించాలని పిఆర్టియూటీఎస్ జిల్లా శాఖ అధ్యక్షులు సంకా బద్రి నారాయణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు జిల్లాలో 361 మంది ఉపాధ్యాయులు డీఎస్సీ 2024ద్వారా నియామకం కాబడ్డారని ఆయన అన్నారు. వారికి వేతనాలు చెల్లించడానికి అవసరమైన ప్రాన్ నెంబర్లను, ఎంప్లాయ్ ఐడి నెంబర్లను ఖజానా శాఖ వెంటనే ఇవ్వాలని ఆయన జిల్లా ఖజానా శాఖ అధికారికి వినతిపత్రం సమర్పిం చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కల్లెం వెంకటరెడ్డి, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూక్య రామోజీ నాయక్, కాపర బోయిన సుజాత మండల బాధ్యులు కె. నాగరాజు,బాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాద్వారా ఎనిమిది మందికి ఉద్యోగ అవకాశం

**ఉపాధి అధికారి టి.రజిత**



**తొలి సమయం మహబూబాబాద్ నవంబర్ 4:** సోమవారం జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యం లో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, మహబూబాబాద్ నందు ఖాళీగా ఉన్న బిజినెస్ డెవలప్ మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులను భర్తీ చేయుటకు జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో హాజరైన 32 మంది అభ్యర్థులకు బ్రాంచ్ మేనేజర్ శరత్ కుమార్ ఇంటర్వ్యూ నిర్వహించగా 8 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని జిల్లా ఉపాధి అధికారి టి.రజిత తెలిపారు.

## డబుల్ ఇళ్ల కోసం ఆందోళన

**నాగర్‌కర్నూలు,నవంబర్4:** డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ లబ్దిదారులు నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి తాసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్రూం లబ్దిదారుల పోరాట సంఘం నాయకులు ఆంజనేయులు, నర్సింహా మాట్లాడుతూ.. కల్వకుర్తి పట్టణంలోని డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి నాలుగేండ్లు అవుతున్నదని, లక్కీడిప్ ద్వారా లబ్దిదారులను ఎంపిక చేసి కూడా 18 నెలలు గడుస్తున్నదన్నారు.

## రైస్ మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలకులో బడి

# లక్ష్యాలను పూర్తి చెయ్యాలి

**రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ**

**క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారులు**

**జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**





**తొలిసమయంకలక్టరేట్ మహబూబాబాద్ నవంబర్4 :** సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, సంబంధిత అధికారులతో కలిసి జిల్లాలోని రైస్ మిల్లర్లతో ధాన్యం కొనుగొల్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు జిల్లాలో రైస్ మిల్లర్లు, మిల్లులను నిర్వహించాలని, నిర్దేశించిన ప్రకారం బ్యాంకులకు ఒప్పందాలు సమర్పించాలని, సీఎంఆర్ డెలివరీ అయిన తర్వాత లారీలను వెంటనే పంపాలని ధాన్యం కొనుగోలు అనంతరం దిగుమతి నివేదికలను వెంటనే సమర్పించాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన లక్ష్యాలను సకాలంలో మిల్లర్లు పూర్తి చేయాలన్నారు, ఏ,బి, రిజిస్టర్లు మెయింటైన్ చేయాలని, ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా మిల్లర్లు సహకరించాలని కలెక్టర్ కోరారు. అనంతరం మండల స్థాయిలో తహసిల్దార్లు, ఎంపీడీవోలు, కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలతో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ సూచనల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయడం జరిగిందని అట్టి కేంద్రాలలో అన్ని వసతులు కల్పిస్తూ సన్న రకాలు, దొడ్డు రకాలు, కేంద్రాలలో మ్యాచ్చర్, చూసి ధాన్యం స్వీకరించాలని, రైతుల యొక్క బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్, తదితర అంశాలను ఆన్లైన్లో నమోదు చేయాలని, ధాన్యం రవాణా వ్యవస్థలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ఇప్పటికే ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ప్రతిరోజు నివేదికలు సమర్పిం చాలని ఎలాంటి సమస్యలు ఏర్పడిన వెంటనే సంబంధిత అధికా రులకు సమాచారం అందించి పరిష్కరించాలని సూచించారు. పౌరసర ఫరాల శాఖ, వ్యవసాయ శాఖ, సహకార శాఖ, గిరిజన కార్పొరేషన్, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి అన్ని విభాగాలు కలిసి పనిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ ఆర్డిఓ కృష్ణవేణి, డీఎస్ఓ ప్రేమ్ కుమార్, డీఎం సివిల్ సప్లై కృష్ణవేణి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అంబరీష్, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన్ రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, డిఏఓ విజయనిర్మల, మండలాల నుండి తాసిల్దారులు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను 12 వారోల్లో నమోదు చేసుకోవాలి

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.మురళీధర్**





**తొలి సమయంమహబూబాబాద్, నవంబర్.4**
సోమవారం ఐ.డి.ఓ.సి లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, ఆప్తాలమిక్ ఆఫీసర్స్, సూపర్వైజర్ స్టాఫ్ కి జాతీయ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి మురళీధర్ మాట్లాడుతూ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలైన, మెటర్నల్ చైల్డ్ హెల్త్, కీటక జనిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధిలు, విస్తృత వ్యాధి నిరోధక టీకాలు, కుష్టి వ్యాధి, క్షయ వ్యాధి, హెచ్ ఐ వి,ఎయిడ్స్, మరియు కుటుంబ నియంత్రణ కార్యక్రమాలలో భాగంగా గర్భిణీ స్త్రీల నమోదు 12 వారాలలో నమోదు చేయాలని, మొదటి రెండు చెకప్ లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారితో, మూడు నాలుగు చెకప్ లు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో స్త్రీ వైద్య నిపుణులచే పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైతే స్కానింగ్ కూడా తీయబడునని, గర్భిణీ స్త్రీలను తీసుకువెళ్లడానికి 102 వాహనాన్ని ఉపయోగించుకోవాలని, సాధారణ ప్రసవాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చేయాలని, సిజేరియన్ ఆపరేషన్లు తగ్గించాలని, మొదటి కాన్పుకు, రెండవ కాన్పుకు మధ్యన ఎడమ ఉండడానికి తాత్కాలిక పద్ధతుల గూర్చి అవగాహన కల్పించాలని, ఇద్దరు పిల్లలైనా ఆడైనా, మగైనా కుటుంబ నియంత్రణ పద్ధతులైన, మగవారికి కోత కుట్టు లేని ఆపరేషన్ అయినా ( నొస్కాల్ పేల్ ) వ్యాసెక్టమీ ఆపరేషన్ గూర్చి, మరియు స్త్రీలకు ట్యూబక్టమ్ ఆపరేషన్ గూర్చి ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు.విస్తృత వ్యాధి నిరోధక టీకాలు పుట్టిన దగ్గర్నుంచి ఐదు సంవత్సరాలు పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని, టీకాలు 100% అయ్యేవిధంగా కృషి చేయాలని, రక్తహీనత గుర్తించి ఐరన్ పోలిక్ యాసిడ్ టాబ్లెట్లు ఇవ్వాలని కోరడం జరిగింది. అసంక్రమిత వ్యాధులైన బీపీ షుగర్, క్యాన్సర్ స్క్రీనింగ్ 30 సంవత్సరాల పైబడిన వారందరినీ పరీక్షించాలని, మందులు సరిగా వాడాలని , ప్రైవేట్ లో వాడుతున్న వారందరినీ , గవర్నమెంట్ హాస్పిటల్ కు వచ్చే విధంగా అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ కూడా అబ కార్డు ఆన్లైన్ క్రియేట్ చేసుకోవాలని, పేర్కొన్నారు. క్షయ వ్యాధి గురించి సమీక్షిస్తూ రెండు వారాల మించి దగ్గు ఉన్నచో తెమడ పరీక్ష చేయించుకోవాలని, క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలలో మందులు వాడినచో క్షయ వ్యాధి నయమవునని అవగాహన కల్పించాలి. కీటక జనత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ,చికెన్ గునియా, ఫైలేరియా వ్యాధులు రాకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఫ్రైడేడ్రైడే నిర్వహించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమములో డాక్టర్ సుధీర్ రెడ్డి , డాక్టర్ సారంగం, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ శ్రవణ్ కుమార్,డిప్యూటీ డెమో కే.ప్రసాద్,హెల్త్ ఎడ్యుకేటర్ కె.వి.రాజు, పురుషోత్తం,సబ్ యూనిట్ ఆఫీసర్స్ రామకృష్ణ, వడ్డెబోయిన శ్రీనివాస్,ఐసిడిపిహెచ్ఎన్ఓ మంగమ్మ, డిపిఓ రుక్మొద్దీన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీస్తు బోధనలు అనుసరణీయం

**ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్**





తొలి సమయం మహబూబాబాద్ నవంబర్ 4: పట్టణంలో ఎండీపీఎలెఫ్ మహబూబాబాద్ జిల్లా పాస్టర్స్ లే లీడర్స్ ఫెలోషిప్ అధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు పాస్టర్ కుమార స్వామి అధ్యక్షతన ఐదవ వార్షికోత్సవ వేడుక షారోన్ చర్చి లో ఘనంగా జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహబూబాబాద్ శాసనాసభ్యులు డాక్టర్ మురళి నాయక్,ఎండీపీలీఫ్ ఫౌండర్ బిషప్ తిమోతి మల్లెపాక ఏఐసీఎఫ్ ఫౌండర్ గద్దపాటి విజయరాజు హాజరయ్యారు ఈ సందర్భంగా స్థానిక శాసన సభ్యులు డాక్టర్ మురళి నాయక్ మాట్లాడుతూ ప్రజలు దైవత్వంలో పెరగడం వలన సమాజం మంచి మార్గంలో నడవడానికి క్రీస్తు మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరినీయం అని అన్నారు. క్రీస్తు మార్గంలో దయ, ప్రేమ, శాంతి, సహనం ఉంటాయి అని, వాటిని అనుసరించి జీవించినప్పుడే సంతోషముగా ఉండగలమన్నారు.. యేసుక్రీస్తు ప్రపంచానికి శాంతి సందేశం, ప్రేమ మార్గం బోధించారు యేసు క్రీస్తు సందేశం మానవాళికి అనుసరణీయం అన్నారు.మానవులకు నిష్కల్మషమైన ప్రేమను పంచి..మనసును శుద్ధి చేసి పరివర్తన తీసుకువచ్చిన మహనీయుడు యేసు క్రీస్తు అని మహబూబాబాద్ నియోజక వర్గంలో క్రైస్తవుల సమాధుల తోట,క్రైస్తవుల సమస్యలపై ప్రభుత్వం తరుపున పరిష్కరించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు ఈ సందర్భంగా ఏఐసీఎఫ్ అధ్యక్షులు విజయరాజు గారు మాట్లాడుతూ దళిత క్రైస్తవుల హక్కుల కొరకు ప్రతి ఒక్కరూ ముందు ఉండి మన హక్కుల పరిష్కారానికై శాంతియుతంగా ప్రభుత్వాన్ని విన్నవించుకోవాలని దళిత క్రైస్తవులు ప్రభుత్వం అందించే అన్నింటికీ అర్హులని అన్నారు.

ఇంకా ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న,స్థానిక సంఘ కాపరి పాస్టర్ పి సంపత్ కుమార్ గారు ఎండిపిఎల్లెఫ్ జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులు,బంటు ప్రభుచరణ్,జటంగి డేవిడ్, హరికట్ల వెంకట్ రెడ్డి,గుండె డేవిడ్,జంగాల జాన్ వేస్లీ, మాల్సూర్ నాయక్, ఈఎస్ ప్రభు జీవన్, జంగాల జాన్సన్,జాన్ వెస్లీ,భట్టు కృష్ణ మోహన్,బుచ్చన నాయక్,బొబ్బిలి వినోద్ ,జన్ను మహేందర్,నిరుటి సిల్వాన్ ,కరుణాకర్,తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ వరదల్లో నిమ్మల పనితీరు అద్భుతం

**- చంద్రబాబు, నిమ్మల కష్టం వల్లనే ప్రజలకు సేవలు**

**- వైసిపి ఉండివుంటే ఇది సాధ్యమయ్యేది కాదు - ఎన్డిఎ పక్ష నేతల భేటీలో మంత్రి టిజి భరత్**

**కర్నూలు,నవంబర్4:** బుడమేరు పొంగి వరదలు వచ్చిన సమయంలో సిఎం చంద్రబాబు, యమంత్రి నిమ్మల తదితరులు సకాలంలో కార్యక్షేత్రంలోకి దిగడం వల్లనే ఉపద్రవం తప్పిందని మంత్రి టీజీ భరత్ అన్నారు. వైసీపీ ప్రభుత్వం ఉండి ఉంటే బుడమేరు గండ్లు పూడ్చడం అంతా ఆశామాషి అయ్యేది కాదన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు వల్లే సాధ్యమైందని మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలులోని మౌర్య హోటల్లో టీడీపీ, బీజేపీ, జనసేన ఎన్డీఏ కూటమి పక్షాల నాయకులు సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు పొలిటికల్ గవర్నేన్స్ అన్నారని.. ఏ పని ఉన్నా పక్కాగా చేయాలని అన్నారన్నారు. ఎన్నికల్లో జనసేన, బీజేపీ కూడా బాగా పని చేశాయని చెప్పుకొచ్చారు. తమతో పని చేయించుకునే హక్కు కూటమి శ్రేణులకు ఉందని.. కార్యకర్తలు వెంటపడి మరీ పని చేయించుకోవాలన్నారు. జిల్లా నుంచి 2.50 లక్షల మంది వలసలు వెళ్తున్నారన్నారు. వచ్చిన ప్రతి పారిశ్రామిక వేత్తను కర్నూలులో పరిశ్రమలు పెట్టమని అడుగుతున్నామన్నారు. 20 ఏళ్లు టీడీపీ కూటమి ప్రభుత్వం ఉండాలని ఆకాంక్షించారు. చిన్న చిన్న సమస్యలు పరిష్కరించుకొని ముందుకు వెళ్లాలన్నారు. మన ఓటమి కోసం పని చేసిన వాళ్లను జనసేన, బీజేపీ పార్టీల్లో సెల్టర్ కోసం వెళ్తున్నారు.. వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని మంత్రి టీజీ భరత్ సూచించారు.కర్నూలు జిల్లా ఇన్ఛార్జి మంత్రిగా రావడం అదృష్టంగా భావిస్తున్నానని.. ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడే స్వభావం రాయలసీమ వారిదని జిల్లా ఇంచార్జీ మంత్రి, మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. వెనకబడిన కర్నూలు జిల్లాకు సేవలు అందించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. 93 శాతం స్ట్రైక్ రేటులో ఎలా గెలిచామో.. రాబోయే ఎన్నికల్లో కూడా అదే స్ట్రైక్ రేట్ రావాలన్నారు. వైసీపీ వెంటిలేటర్ పైన ఉందని.. అబద్దాల బ్రతుకే జగన్ జీవనమంటూ వ్యాఖ్యలు చేశారు. నాయకు మధ్య.. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు వైసీపీ సోషల్ మీడియా పని చేస్తోందని మండిపడ్డారు. నీటి సంఘాల ఎన్నికల్లో మూడు దశల్లో ఉంటాయని... అన్నింటా గెలవాలన్నారు.

## ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్

**సందర్శించి పరామర్శించిన ఎమ్మెల్యే కోవా లక్ష్మి**

**కుమ్రంభీం ఆసిఫాబాద్,నవంబర్4:** ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి మండల కేంద్రంలో ఉన్న ఆశ్రమ పాఠశాలలో 60 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఫుడ్ పాయిజనింగ్ కారణంగా అమ్మాయిలు అస్వస్థతకు గురైనట్లు అధికారులు నిర్ధారించారు. బాధిత విద్యార్థినులను బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఫుడ్ పాయిజన్పై ఎమ్మెల్యే కోవా లక్ష్మి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. పాఠశాల పరిసరాల్లో పరిశుభ్ర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నతాధికారులు హాస్టల్ను పరిశీలించి, మౌలిక వసతులు మెరుగుపరచాలని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాల హాస్టల్ నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంఘాలు, పలు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. హాస్టల్లో మొత్తం 591 మంది విద్యార్థినులు ఉంటున్నారు. అయితే ఫుడ్ పాయిజనింగ్ కారణంగా భయంతో చాలా మంది విద్యార్థినులు తమ నివాసాలకు వెళ్లినట్లు సమాచారం. ప్రస్తుతం హాస్టల్లో 100 మంది ఉన్నట్లు తెలుస్తోంది.

## పంటనష్ట పరిహారం చెల్లింపులో నిర్లక్ష్యం

**ఎమ్మార్వో కార్యాలయం ముందు రైతుల ధర్నా**

**కుమ్రంభీం ఆసిఫాబాద్,నవంబర్4:** వర్షాలతో దెబ్బతిన్న తమకు పంట నష్టపరిహారం అందలేదని రైతులు ఆందోళనకు దిగారు. ఈ ఏడాది జూలై, ఆగస్టు నెలలో కురిసిన అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఇప్పటివరకు నష్టపరిహారంఅందలేదని సోమవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట దిందా, కేతిని, చిత్తం గ్రామాలకు చెందిన 60 మందికి పైగా రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాణహిత నదితో పాటు దిందా-కేతిని వాగు వరదకు సుమారు 150 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. అధికారులు వచ్చి క్షేత్రస్థాయిలో సర్వే చేయకుండా ప్రైవేట్ వ్యక్తులతో జాబితా తయారు చేయించారని, అందులో అసలైన బాధితుల పేర్లు లేవని మండిపడ్డారు. అనర్హుల నుంచి వ్యవసాయ శాఖ అధికారి కమిషన్లు తీసుకున్నారని, ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి సర్వే చేసి బాధిత రైతులకు న్యాయం చేయాలన్నారు. అవకతవకలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

## కోడెల శివప్రసాద్ గౌరవానికి భంగం వాటిల్లదు

**గౌరవప్రదంగా కోడెల విగ్రహ ఏర్పాటు**

**పల్నాడు జిల్లా ఇన్ఛార్జ్ మంత్రి గొట్టిపాటి**

**నరసరావుపేట,నవంబర్4:** తెలుగుదేశం పార్టీలో ఏపీ అసెంబ్లీ మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావుకి ఎప్పుడూ సముచిత స్థానం ఉంటుందని పల్నాడు జిల్లా ఇన్ఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఆయన విగ్రహాన్ని గౌరవప్రదంగా ఏర్పాటు చేస్తామని అన్నారు. తెలుగుదేశం పార్టీతో దశాబ్దాలుగా అనుబంధం ఉన్న ఆయనకు గౌరవ మర్యాదల్లో ఎక్కడా భంగం వాటిల్లదని ఆయన పేర్కొన్నారు. అయితే కోడెల విగ్రహాన్ని దొంగచాటుగా అర్ధరాత్రుళ్లు పెట్టాల్సిన అవసరం లేదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. కోడెల విగ్రహాన్ని అన్ని అనుమతులతో త్వరలోనే గౌరవప్రదంగా ప్రతిష్టిద్దామన్నారు. కానీ కొన్ని శక్తులు సమస్యలు సృష్టించేందుకు యత్నం చేస్తే మాత్రం సహించేది లేదని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ హెచ్చరించారు. నరసరావుపేటలోని ప్రభుత్వాసుపత్రిలో కోడెల శివప్రసాదరావు విగ్రహాన్ని ఇటీవల ఆయను అభిమానులు ఏర్పాటు చేశారు. అయితే అనుమతి లేదంటూ మున్సిపల్ ఉన్నతాధికారులు ఆ విగ్రహాన్ని తొలగించారు. ఈ వ్యవహారంపై కోడెల శివప్రసాదరావు కుమారుడు కోడల శివరామ్ ఇప్పటికే స్పందించారు. తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటి నుంచి ఆయన తుది శ్వాస విడిచే వరకు పార్టీలో నిబద్ధతతో పని చేశారని కోడెల శివరామ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. కోడెల విగ్రహం తొలగింపు సందర్భంగా ఆయన అభిమానులు ఇప్పటికే నిరసన చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో పల్నాడు జిల్లా ఇన్ఛార్జ్ మంత్రి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పైవిధంగా స్పందించారు. కోడెల వర్ధంత్రి సందర్భంగా ఆయన విగ్రహాన్ని లింగంగుంట్ల ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఆయన అభిమానులు ఏర్పాటు చేసిన విషయం విదితమే. మరోవైపు ఈ వ్యవహారంపై ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సైతం స్పందించారు. కోడెల శివప్రసాదరావు విగ్రహం తొలగించడంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అరబిందో సంస్థకు ప్రభుత్వం షాక్

**అమరావతి,నవంబర్4:** 108, 104 వాహనాల సేవల నుంచి అరబిందో సంస్థను తొలగిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఉద్యోగులకు జీతాలు ఇవ్వకపోవడం, సేవల నిర్వహణ సరిగా లేకపోవడం, కనీసం వాహనాల మెయింటెనెన్స్ కూడా చేయకపోవడంతో ఆ సంస్థను 108, 104 సేవల నుంచి తప్పించాలని చంద్రబాబు సర్కార్ నిర్ణయించింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేస్తూ, కొత్తగా బాధ్యతలు అప్పగించేందుకు టెండర్లు పిలవాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. వైసీపీ హయాంలో టెండర్లు దక్కించుకున్న అరబిందో సంస్థ 108, 104, 102 ఉద్యోగులకు నరకం చూపించింది. ఈ మూడు పథకాల కింద వాహనాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు రెండు, మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా వారిని ఇబ్బందులకు గురి చేసింది.

